
సమస్యలపై ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న ఆదిత్యనగర్‌వాసులు

ఆదిత్యనగర్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

హైదర్‌నగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్ కాలనీవాసుల సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆదివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. దీనికి స్పందించిన గాంధీ మాట్లాడుతూ.. ఆదిత్యనగర్‌లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలోనే చేపట్టి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అన్ని రకాలుగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాసీం, లియాకత్ అలీ, మొయిస్, అజీమ్ బాయ్, సయ్యద్, మహ్మద్, అమీర్, రిజ్వాన్, అస్లాం, నవాబ్, ఫజల్, స్నేహ, రాజేష్, అష్రాఫ్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గానికి చెందిన మీర్ అసిఫ్ అలీఖాన్ వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో మంజూరైన రూ.లక్ష మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు.

బాలానగర్ సీఐ బదిలీ

బాలానగర్, అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి): బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పేట్‌బషీరాబాద్ డీఐగా పని చేస్తున్న టి.నర్సింహ్మరాజు సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. బాలానగర్ సీఐగా విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు డీఐగా బదిలీ అయ్యారు.


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

పద్మానగర్ ఫేజ్-2లో రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించండి

కుత్బుల్లాపూర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పద్మానగర్ ఫేజ్-2 సర్వే నంబర్ 58 నుంచి 226 వరకు ఆగిపోయిన రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించాలని కోరుతూ కాలనీ ప్రజలు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా వక్ఫ్ బోర్డు స్థలాల నెపం చూపిస్తూ ఈ సర్వే నంబర్‌లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చిలింగంగౌడ్, దుర్గారావు, ఓబుల్‌రెడ్డి, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.


మహారాణి దుర్గావతి జయంతి కార్యక్రమంలో ప్రగతినగర్ వాసులు

ఘనంగా మహారాణి దుర్గావతి జయంతి

నిజాంపేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజు ఆధ్వర్యంలో రాత్రి మహారాణి దుర్గావతి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాణి దుర్గావతి పేరు వినగానే నారీ శక్తికి ఉన్న గౌరవం గుర్తుకు వస్తుందన్నారు. స్వధర్మం, దేశం కోసం, మాతృభూమి గౌరవం నిలబెట్టేందుకు పేరులోనే కాదు, చేతల్లోనూ దుర్గామాత అవతారం ఎత్తిన రాణి దుర్గావతి అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు సూర్యనారాయణ, నరేంద్ర చౌదరి, కిషోర్, అశోక్, భరత్, రమేష్, పటేల్, కవిత, ప్రియదర్శిని, స్థానికులు ఉన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్ సీపీఎం మండల కార్యవర్గం ఎన్నిక

గాజులరామారం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం సీపీఎం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. షాపూర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండల సీపీ ఎం పార్టీ నూతన కార్యదర్శిగా కీలుకాని లక్ష్మణ్ ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మూసీ సుందరీకరణ పేరుతో పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చడం అమానుషమని, హైడ్రా పేరుతో అమాయకులకు అన్యాయం చేస్తే సీపీఎం పార్టీ ఊరుకోదన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, రావుల స్వాతి, దేవదాన, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల బదిలీల జాబితా రెడీ?

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి, కొండాపూర్ డివిజన్ల పరిధిలో సుమారు 30 మంది విద్యుత్ ఉద్యోగులు బదిలీ కానున్నారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీలు చేస్తుండగా.. టీజీఎస్‌పీడీసీఎల్‌లో మాత్రం రెండేళ్లు పూర్తిచేసుకున్న వారిని బదిలీ చేసేలా ఆర్డర్స్ వచ్చినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అయితే మొత్తం ఉద్యోగుల్లో 50శాతం మాత్రమే బదిలీ ప్రక్రియ చేపడుతుండటంతో కొందరు మూడేళ్లకు పైగా పనిచేస్తున్నా ఆపై సీనియర్ మాత్రమే బదిలీ కానున్నారు. దీంతో ఒకేసారి సగం మంది ఉద్యోగులు కొత్తగా బదిలీపై వస్తారని చెబుతున్నారు. పండగలోపే బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా ఉందని ఓ అధికారి తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, ఔత్సాహికులు

ఫక్రుద్దీన్‌గుట్టపై అంతర్జాతీయ జియోడైవర్సిటీ డే

నార్సింగ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీని గచ్చిబౌలి ఫక్రుద్దీన్ గుట్టపై ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ హాజరై మాట్లాడారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు ఫక్రుద్దీన్ గుట్టను సందర్శించామని తెలిపారు. పాడవుల గుట్ట, భువనగిరి, దేవరకొండ, ఉండ్రుకొండ, బొమ్మలమ్మ గుట్టతో పాటు మరెన్నో రాతి కట్టడాలు, స్థలాలు, ప్రాంతాలను గుర్తించి, సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అనంతరం మహేందర్‌రెడ్డి, జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ వేణుగోపాల్‌రావు, రామోజు హరగోపాల్ మాట్లాడారు. ఎస్ఎస్ ప్రసాద్, మహేందర్‌రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.సుభాష్‌రెడ్డి, జనబ్ మహ్మద్ అఫ్జల్, ఇలియాస్‌ఖాన్, సేవ్‌నయాఖిల్లా, ధనుంజయ, నరహరి, శ్రీకృష్ణ, మహ్మద్ ఒమర్, అలీ, సర్ఫరాజ్, బస్వరాజ్, వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
● గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ రన్‌ఫర్ గ్రేస్ 10కే, 5కే, 2కే రన్ ప్రారంభం



విజేతలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు

గచ్చిబౌలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడమే అందుకు నిదర్శనమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ రన్‌ఫర్ గ్రేస్ 10కే, 5 కే, 2 కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల పట్ల ఇష్టం పెంచుకోవాలని, క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన వారు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ డాక్టర్ చిన్నబాబు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సేవలు చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. 130 దేశాల్లో భౌతిక, వర్చువల్‌గా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద అవగాహన రన్ అని చెప్పడానికి గర్విస్తున్నానని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ఆరోగ్య రాజధాని అని, వివిధ దేశాలకు సరఫరా అయ్యే ఔషధాల్లో 40-50 శాతం ఇక్కడే తయారు అవుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఫౌండేషన్ నిర్వాహకులు, అంతర్జాతీయ మారథాన్ క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దేవి పూజలు

● 4వ రోజు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం
● పూజలు చేసిన ఎమ్మెల్యేలు


● హైదర్‌నగర్: వివేకానందనగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర్‌నగర్ 33-బ్లాక్‌లో నల్లపోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి పూజలు చేశారు.


మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీదుర్గా మల్లీశ్వరి దేవాలయం ప్రాంగణంలో 4వ రోజు లలితా త్రిపురసుందరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా పూజల్లో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, రవి, చంద్రారెడ్డి, మహేందర్, శ్రీనివాస్‌యాదవ్, భాను, అజీమ్, రాజు పాల్గొన్నారు.


హెచ్‌పీ రోడ్డులో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో బీఆర్‌ఎస్ నేతలు


గచ్చిబౌలిలో నాలుగో రోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో..


నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కేటీఆర్‌కాలనీ, సాయి బృందావనం కాలనీ, బాచుపల్లిలో ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


బీబీజే యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసాపేట జనతానగర్ కొండపోచమ్మ దేవాలయంలోని అమ్మవారి మండపంలో ఎండీ నవాజ్ పాషాను సత్కరిస్తున్న నిర్వాహకులు


అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్, కాంతారావు, మల్లారెడ్డి


నిజాంపేట్ కార్పొరేషన్‌లో దేవీ నవరాత్రి పూజల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్, గణేష్‌నగర్‌ల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి, నాయకులు


కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయం ఆదివారం లలితాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని అసిస్టెంట్ మేనేజర్ భానుప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్ బి. మహేష్ పూజలు చేశారు. ఈ పూజల్లో డీజీఎం రాంప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ హరికృష్ణ, గణేష్, రాజు, సింహాచలం, జాన్ వెస్లీ, సురేష్‌కుమార్, అరుణకుమార్ సాత్విక పాల్గొన్నారు.


ధర్నాలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించకపోతే ఉద్యమిస్తాం

● ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్‌సిటీ పేరుతో ఊహల నగరానికి మెట్రో విస్తరించాలనుకోవడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మెట్రోరైల్ కోసం సర్వే చేసిన కొంపల్లి, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట్ ప్రాంతాలను విస్మరించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమేనని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలే తప్ప స్వార్థ రాజకీయల కోసం కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, మెట్రో సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ ఆక్రమణ

ఎమ్మెల్యే వేసిన శిలాఫలకం తొలగింపు

దుండిగల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లి సారెగూడెం గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటికను ఆక్రమించడంతో పాటు శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించడానికి 2021న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ప్రహరీ నిర్మించడానికి శిలాఫలకం వేశారు. ప్రహరీ కోసం రూ.5 లక్షలు కేటాయించారు. ఇదే అదునుగా భావించిన ఓ బిల్డర్ ఆ రోడ్డును స్వప్రయోజనాల కోసం


శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి వేసిన శిలాఫలకాన్ని తొలగించి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను దాటి నిర్మించిన రోడ్డు

ఆ శ్మశానవాటికను ఆనుకొని ఉన్న ప్రాంతంలో 40 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీని కోసం పక్కనే పడిగే సముద్రం కుంటను ఆక్రమించి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను దాటి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నాడు. 40 ఫీట్ల రోడ్డును నిర్మించే విషయమై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, స్థానికులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం, అనుమతులు లేకపోవడంతో కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, సారెగూడెం వాసులు పనులను అడ్డుకున్నారు. ఎఫ్‌టీఎల్ స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వెడల్పు కోసం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వేసిన శిలాఫలకాన్ని కూడా తొలగించి ప్రక్కన పెట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న వారిలో కౌన్సిలర్ రామ్‌గౌడ్, మహేందర్‌యాదవ్, స్థానికులు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, భిక్షపతి, రాజు, నాగార్జున ఉన్నారు.

ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో షెడ్ల నిర్మాణం


బఫర్‌జోన్‌లో వెలిసిన షెడ్లు

ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఫాక్స్ సాగర్ చెరువులో నిర్మాణాలు ఇలాగే కొనసాగితే చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా వెలుస్తున్న నిర్మాణాలను అడ్డుకోవడంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ నేత ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

అపరిశుభ్రంగా కిచెన్‌లు, గడువు తీరిన పదార్థాలు

గచ్చిబౌలిలోని రెస్టారెంట్‌లు, పబ్బుల్లో అధికారులు తనిఖీలు

రాయదుర్గం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు గచ్చిబౌలిలోని పలు పబ్‌లు, రెస్టారెంట్లలో ఈనెల 4న తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మారేడుమల్లి రెస్టారెంట్‌తో పాటు ఓవర్ ది మూన్ పబ్, డ్రైయింగ్ హో చైనా రెస్టారెంట్ తనిఖీలు చేసిన అధికారులు కిచెన్‌లో బొద్దింకలు తిరగడం, గడువు ముగిసిన పాలకోవా నిల్వలను వారు గుర్తించారు. డస్ట్‌బిన్ క్లీన్‌గా లేకపోవడం, డ్రైన్ వాటర్ నిల్వ వుండటం, కిచెన్ ప్రాంతంలో రిఫ్రిజిరేటర్స్‌లో బొద్దింకలు తిరగడం వంటివి అధికారులు గుర్తించారు. అదే విధంగా కిచెన్‌లకు విండోలు సరిగా లేకపోవడంతో పురుగులు, ఇతర కీటకాలు నేరుగా వచ్చి ఆహార పదార్థాలపై వాలుతూ ఉండటం గుర్తించిన అధికారులు, సెప్టెంబర్ 6తో గడువు ముగిసిన వంటల్లో వినియోగించే పదార్థాలు, పాడైన కూరగాయాలు, నిర్వాహకులు మెడికల్ ఫిట్‌నెస్ వంటికి చూపించకపోవడం వంటి పలు అంశాలను అధికారులు గుర్తించి ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

కులగణనపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

బర్కత్‌పుర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కులగణనపై చిత్తశుద్ధి లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశాచారి అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనపై జీవో 26, జీవో 199లను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడమే కాక రూ.150 కోట్లను కేటాయించిందన్నారు. బీసీ కమిషన్ ఏర్పాటై నెలరోజులు గడిచినా కులగణన చేయలేదని అన్నారు. కులగణనకు సంబంధించి ఇప్పటి వరకు గైడ్‌లైన్స్ విడుదల చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కుందారం గణేషాచారి తదితరులు

నియో స్కిన్ సెంటర్ ప్రారంభం

గచ్చిబౌలి: మాదాపూర్‌లో నియో స్కిన్ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై ప్రారంభించారు. సినీనటులు ప్రభాకర్, చంద్రహాస్, రాజేష్, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, అవంతిక శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


నియోస్కిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


నియోస్కిన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గొట్టిముక్కల పాండురంగారావు

హైదర్‌నగర్: మాదాపూర్‌లో నియో స్కిన్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గసభ్యుడు, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొట్టిముక్కల పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

సందడిగా బతుకమ్మ, దసరా ఉత్సవాలు

మాదాపూర్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో సారీస్ ఆఫ్ ఇండియా బతుకమ్మ, దసరా ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ప్రత్యేక స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తులను కొనేందుకు నగరవాసులు ఆసక్తి చూపించారు. సందర్శకుల ఆటవిడుపు కోసం ఆదివారం సాయంత్రం టీకే సిస్టర్స్ డాక్టర్ సరోజ, డాక్టర్ సుజాత సంగీత కచేరి అలరించింది. అనంతరం కళాకారుల కూచిపూడి ప్రదర్శన, శరన్నవరాత్రులలో ఉన్న 9 అమ్మవారి రూపాలను ధ్యానిస్తూ పలువురు వాగ్గేయకారులు రచించిన కీర్తనలను ఆలంబన, నాట్యప్రదర్శన సందడిగా సాగింది.


కళాకారుల ప్రదర్శన

కోలాహలంగా బతుకమ్మ సంబరాలు


చందానగర్ పీజేఆర్ స్టేడియంలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

చందానగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ నిలువెత్తు ప్రతీక అని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చందానగర్ పీజేఆర్ స్టేడియంలో మహాబతుకమ్మ వేడుక ఆదివారం రాత్రి నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలను తయారు చేసుకుని స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియంలో బతుకమ్మ పాటలతో మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మిరియాల రాఘవరావు, ఉరిటి వెంకట్రావ్, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండా విజయ్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

జీడిమెట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దాదాపు 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో షాపూర్‌నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. బాలానగర్ నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నారు.

అస్కా ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడురోజులు ఉచిత శిక్షణ శిబిరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అశ్విత సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (అస్కా) మహేంద్ర అశ్విత ఆధ్వర్యంలో హఫీజ్‌పేట రోడ్డులో బ్రహ్మకుమారీస్ వివేకానందనగర్‌కాలనీ విభాగం విద్యార్థులకు మూడు రోజులు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ నుంచి జ్యోతిసిస్టర్, విద్యాసిస్టర్, శ్రీకాంత్, ప్రభాకర్, పురుషోత్తమరావులు పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో విలువలతో కూడిన విద్య, ధ్యానం, ఆటలు, జ్ఞాపకశక్తి, అభివృద్ధికి సూచనలు లాంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు యోగ్యత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.ఎం.రావు, హరిప్రసాద్, అజయ్ మేగా, సుదర్శన్, అస్కా అధ్యక్షుడు ఎన్.పాపారావులు పాల్గొన్నారు.